గడిగరేవుల.. అభివృద్ధి కళకళ !

- పట్టణాన్ని తలపిస్తున్న వైనం
- రూ.కోటితో సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం నిర్మాణాలు
- రైతులకు అందుబాటులోకి రూ.80లక్షలతో నిర్మించిన గోదాములు
- ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని అంతర్గత సీసీ రహదారులకు రూ.35 లక్షలతో మోక్షం
- రూ.కోటితో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న దుర్గా భోగేశ్వర క్షేత్రం
- ఎమ్మెల్యే కాటసాని చొరవతో కళకళలాడుతున్న గడిగరేవుల గ్రామం


సేవలకు సిద్ధంగా రైతు భరోసా కేంద్రం


హెల్త్ సెంటర్




గ్రామంలో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డు, రైతులకు అందుబాటులో మల్టీపర్పస్ గోడౌన్లు, ఎస్సీ కాలనీలో నిర్మించిన మురుగు కాలువ


గడిగరేవుల నూతనంగా నిర్మించిన సచివాలయం

గడివేముల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మారుమూల గ్రామాలకు సైతం మౌలిక వసతులు చేకూరడంతో కళకళలాడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో పల్లెలు సైతం పట్టణాలను తలపిస్తున్నాయి. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామం. గతంలో పౌర సేవల కోసం పది కిలోమీటర్లకు పైగా మండల కేంద్రానికి వెళ్లాల్సిన అగత్యం, పడకేసిన పారిశుద్ధ్యంతో గడిగరేవుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామం పూర్తిగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రతి వీధికి సీసీ రోడ్లు, మురుగు కాలువలు, రైతులు తమ ఉత్పత్తులను భద్రంగా దాచుకోవడానికి చక్కని గోదాములు వెరసి గ్రామ స్వరాజ్య భావనకు దర్పణంలా నేడు ఆ ఊరు అలరారుతోంది. మౌలిక వసతులు చేకూడంతోపాటు ఏళ్లతరబడి నెలకొన్న రహదారుల సమస్యలు తీరడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసాని కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గడచిన 57 నెలల్లో గడిగరేవుల గ్రామం అభివద్ధి పరుగులు పెట్టింది. డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కింద 6067 మందికి గాను రూ.149770367 కోట్లు అందించడం జరిగింది. అదే విధంగా నాన్ డీబీటీ ద్వారా 1810 మందికి గాను రూ.29995128 కోట్లను ఖర్చు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు, పక్కా భవనాలు: గ్రామంలో రూ.లక్షలు ఖర్చు వెచ్చింది గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా, హెల్త్ సెంటర్ల భవనాలను నిర్మించారు. రూ.20 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించారు. ముఖ్యంగా బీసీ,ఎస్సీ కాలనీల్లో కొన్నేళ్లుగా సరైనా రోడ్డు లేక పోవడంతో కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరగా వెంటనే నిధులు మంజూరు చేయించారు. అదేవిధంగా రూ.5 లక్షలతో మురుగు కాలువలు నిర్మించారు.

మారిన పాఠశాలల రూపురేఖలు

గడిగరేవుల ఎంపీపీ పాఠశాలలో నాడు నేడు పథకం కింద ఫేజ్ 1లో పాఠశాలల అభివద్ధికి రూ.22.23 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఫేజ్ 2లో జెడ్పీ పాఠశాలకు రూ.63 లక్షల పనులు జరిగాయి. దీంతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కార్ బడి తయారైంది. పాఠశాలు రూపురేఖలు మారడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ప్రభుత్వ కార్యాలయాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా, హెల్త్ సెంటర్ల నిర్మాణం పూర్తయయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. త్వరలోనే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఎంపీఎఫ్సీ (మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్) గిడ్డంగులను నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుని అమలు చేశారు. 500 మెట్రిక్ టన్నుల రెండు గోడౌన్లు ఒక్కొక్కటి రూ.40 లక్షలు చొప్పున వెచ్చించి పూర్తి చేశారు.

గ్రామంలో ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందిన వారి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.లక్షలలో)
ఆసరా	399	3,797,752
అమ్మ ఒడి	400	16,950,793
అర్చకులు	7	35000
చేదోడు	50	119000
క్రాప్ ఇన్సూరెన్స్	262	3995405
రైతు భరోసా	738	32845600
పింఛన్లు	551	52187250
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	225	9652216
వైఎస్సార్ చేయూత	244	11175000

ఎమ్మెల్యే సహకారంతో గ్రామం అభివృద్ధి



ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి సహకారంతో గ్రామంలో దాదాపు రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం. వివిధ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకుని కొత్త రోడ్లు నిర్మించాం. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్,గడిగరేవుల గ్రామం

ప్రజల చెంతకే పాలన



మా గ్రామంలో గాంధీజీ కలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారం అవుతుంది. సచివాలయం,ఆర్బీకే,హెల్త్ సెంటర్ తదితర కార్యాలయంలో నిర్మించడంతో పాటు సిబ్బంది ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ఇంటి వద్దకే చేరుస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. గ్రామాన్ని ఇంత అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

–గోదా ప్రసాద్,ఉప సర్పంచ్

మౌలిక వసతులన్నీ కల్పించారు



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో దాదాపు రూ.30 అభివృద్ధి పనులు జరిగాయి. ఇంత అభివృద్ధి పనులు మా గ్రామంలో ఏనాడు జరగలేదు. మా కాలనీలో కొన్నేళ్లుగా సీసీ రోడ్డు ఇబ్బంది పడ్డాం. వర్షాలు కురిస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. మా ఊరికి ఎమ్మెల్యే కాటసాని వచ్చినప్పుడు సమస్యను విన్నవించాం. వెంటనే మా కాలనీకి రూ.10 లక్షలు మంజూరు చేసి సిమెంట్‌తో పాటు మురుగు కాలువలు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. చాలా సంతోషంగా ఉంది.

–నాగలక్ష్మమ్మ, గడిగరేవుల

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న వారితో డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూడు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. కర్నూలు రూరల్, అర్బన్ మండల పరిధిలో, గూడురు నగర పంచాయతీ పరిధిలోని బాధితులకు మంజూరైన రూ.17 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం నగరంలో క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. తొలిశాపురం సుజాతమ్మకు రూ.2లక్షలు, బి.తాండ్రపాడుకు చెందిన అక్బర్ బాషాకు రూ.లక్ష, ఎల్ల నాగమ్మకు రూ.5లక్షలు, గొందిపర్ల సువర్ణకి రూ 2లక్షలు, పసుపులకి చెందిన సుమలత రూ.2 లక్షలు, మునగాలపాడుకు చెందిన నాగమణికి రూ.లక్ష అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25లక్షలకు పెంచారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పేదలకు అమలు చేసిన ఏకైన సీఎంగా జగనన్న సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారికే పట్టం కట్టాలి

ఓర్వకల్లు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పేద ప్రజల కోసం కష్టపడి పనిచేసే వ్యక్తులకు పట్టం కట్టాలని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాష అన్నారు. ఆదివారం మండలంలోని పూడిచెర్ల సచివాలయ పరిధిలోని బూత్ స్థాయి కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు 'మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్‌లు సిద్ధం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోటర్‌బాషా మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైఎస్ జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు, గృహసారథులు చేపట్టాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం సిద్ధం పోస్టర్లను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు గోవర్ధన్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, సోమశేఖరనాయుడు, కేతవరం ఉప్ప సర్పంచు పుల్లారెడ్డి, సచివాలయ కన్వినర్లు సోమశేఖరనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సిద్ధం పోస్టర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

- నంద్యాల జిల్లా పార్టీ యూత్ వింగ్ సెక్రటరీ ద్వారం శ్రీకాంత్‌రెడ్డి



గడివేముల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తుందని, రైతన్నకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుందని నంద్యాల జిల్లా పార్టీ యూత్ వింగ్ సెక్రటరీ ద్వారం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పెసరవాయి గ్రామాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో కేసీ కెనాల్ కింద పంటలు ఎండుతుండటంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పంటలు చేతి కొచ్చేంత వరకు సాగునీటిని విడుదల చేయించారన్నారు. పెసరవాయి గ్రామంలో రబీ సీజన్‌లో 1352 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారన్నారు. బయటి మార్కెట్ కంటే జొన్నకు ప్రభుత్వం రూ.3180 మద్దతు ధర కల్పించిందని, ఇప్పటి వరకు ఈ క్రాప్ నమోదు చేసుకున్న నిబంధనల ప్రకారం 1800 కింటాళ్ల కొనుగోలు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

మహిళలు ముందుకు రావాలి

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సు కోసం మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం), కందనవోలు కవయిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని తెలుగు తోటలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ మాట్లాడుతూ మహిళలకు అభద్రత, అన్యాయాలు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. నరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబొయిన పార్వతి దేవి మాట్లాడుతూ కవయిత్రులు రచనలతో సరిపెట్టుకోకుండా సమాజ సేవ చేయాలని కోరారు. డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ మహిళలు, చైతన్యవంతులు కావాలన్నారు. సదస్సులో దుర్గాబాయి, సావిత్రిబాయి పూలే, కర్నూలు కవయిత్రి చక్కిలం విజయలక్ష్మిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసం మహిళలంతా సమాజ సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మహిళలంతా కలసి కండే సునీత నేతృత్వంలో 'కందనవోలు నవనారి కవన విజయం' అనే రూపకాన్ని ప్రదర్శించారు. నరసం అధ్యక్షురాలు కావ్యం సుబ్బలక్ష్మి, విజయ దుర్గ జ్యోతిర్మయి, విజయమ్మ, రజనీ కల్కూర, స్వర్ణలత, పద్మలత, జేఎస్ ఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.


కవయిత్రి మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

అనారోగ్యంతో యువకుడి మృతి

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితం తండా వద్ద పవర్ ప్రాజెక్టులో పరిశ్రమలో పనిచేస్తున్న ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నందికొట్కూరు మండలం, కోనేటమ్మపల్లెకు చెందిన బోరెల్లి గోకారి కుమారుడు వేణు(22) క్యాంప్‌లోని విశ్రాంతి గదిలో ఎవరూ లేని సమయంలో ఉలుకు పలుకు లేకుండా పడిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీయగా బలమైన కారణాలేవీ లభించలేదు. మృతుడి తండ్రి గోకారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.


పాణ్యం డీటీ బదిలీ

పాణ్యం: పాణ్యం మండల డిప్యూటి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మల్లికార్జున రెడ్డిని బదిలీపై నంద్యాల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పని చేస్తున్న డీటీ పి.రమాదేవిని పాణ్యంకు నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం వెలువడ్డాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవలే తహసీల్దార్లు, ఎంపీడీఓ ఇతర శాఖల అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే.

చెరకు తోట దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని రామసముద్రంలో ప్రమాదవశాత్తు శనివారం సాయంత్రం చెరకు తోట దగ్ధమయ్యింది. గ్రామానికి చెందిన రైతు మూడున్నర ఎకరాల్లో చెరకు తోట సాగు చేశారు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో చెరుకు తోట దగ్ధమయ్యింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత


దివ్యాంగురాలు ఈడిగ క్రిష్టమ్మకు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ మహేశ్వరి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఈడిగ క్రిష్టమ్మ అనారోగ్యంతో కర్నూలులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ మహేశ్వరీ ఆదివారం కర్నూలు ఆస్పత్రికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని పెన్షన్ అందించారు. దీంతో ఈడిగ క్రిష్టమ్మ పెన్షన్ సొమ్ము తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

గూడూరు రూరల్: మండలవ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మూడవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. పెంచికలపాడు గ్రామానికి చెందిన కురువ పెద్ద సుంకన్న పక్షవాతం కారణంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న వలంటీర్ రామశేషులు ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము రూ.3000 అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఆస్పత్రిలోనే పింఛన్ సొమ్ము అందించడంపై పట్ల లబ్ధిదారుడు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద సుంకన్నకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామశేషులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సద్దల సరళమ్మ


ఉలిందకొండలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


కోడుమూరులో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


పెసరవాయిలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మొల్లా జబీన్

పాణ్యం: పోలియో రహిత సమాజం స్థాపనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పాణ్యం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొండజూటూరు ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0–5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఈ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి పాటు పడాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, రచనారెడ్డి, సూర్యాస్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

కోడుమూరు రూరల్: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని కోడుమూరు కో–లొకేటెడ్, లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీమంత్ మాదన్న, జయంతి అన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు, సిబ్బంది మండలంలో 32 పల్స్ పోలియో బూతులతో పాటు, కోడుమూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ సెంటర్లలోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ మండలంలో 5 సంవత్సరాల్లోపు వయస్సున చిన్నారులు 5015 మంది ఉండగా ఆదివారం సాయంత్రంకల్లా 4943 మందికి పోలియో చుక్కల మందు వేశారని, మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేస్తారన్నారు. సీహెచ్‌ఓ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీహెచ్‌ఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, శారద, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

కల్లూరు: పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యమని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లు ఆనందరావు, రఘు అన్నారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. రెండు చుక్కలు వేయడం వల్ల అంగవైకల్యం బారి నుంచి పిల్లలను కాపాడవచ్చునన్నారు. ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియో నివారణకు రెండు చుక్కలు

గడివేముల: పోలియో రహిత సమాజం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైద్యాధికారిణి డాక్టర్ మొల్లా జబీన్ అన్నారు. మండల పరిధిలోని 31 పోలియో కేంద్రాలలో ఆదివారం జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి చిన్నారులకు చుక్కలు వేశారు. అలాగే మండల కేంద్రమైన గడివేములలోని చెన్నకేశవస్వామి పోలియో కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి పరిశీలించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


గాయపడిన వ్యక్తులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు. ప్యాపిలి మండలం మొండిమడుగు కొత్తూరు గ్రామానికిన చెందిన నరసింహ, శ్రీనివాసులు పాణ్యంలోని చెంచుకాలనీలో వెలసిన సుంకలమ్మను దర్శించుకునేదుకు బైక్‌పై వెళ్తున్నారు. అదేవిధంగా బండి ఆత్మకూరుకు చెందిన నరేష్, రమణమ్మ మరో బైక్‌పై ముందు వెళ్తున్నారు. బర్రెను తప్పించబోయి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు మున్సిపల్ వేలంపాట

గూడూరు: మున్సిపల్ పరిధిలోని వివిధ వ్యాపారాల నిర్వహణ వేలంపాట సోమవారం నిర్వహిస్తామని కమిషనర్ వి.దివాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వాయిదా పడ్డ వారపు సంత, మరి కొన్నింటికి వేలం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ హాజరుకావాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేస్తూ.. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుర్రప్ప ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలకు ఏమైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలో దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటన లో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపి నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని ఎంఈఓ సూచించారు.

6న వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం

కోడుమూరు రూరల్: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈ నెల 6వ తేదీన కోడుమూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ స్థాయి నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాలో ఈ ఏడాది తీవ్రమైన కరువుతో వ్యవసాయ పనులు లేక చాలామంది రైతులు, కూలీలు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లారన్నారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 6న కోడుమూరులో సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, సమావేశానికి సంఘం రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, వెంకట్రావు, ఆవు ల శేఖర్, కేశవరెడ్డి తదితరులు హాజరవుతారని, కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు శేషుకుమార్, సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ నాయకులు చిన్నరాముడు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.154 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లద్దగిరి వద్ద ఉన్న హంద్రీనీవా కాల్వలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతురాలి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, నలుపు, పసుపు పచ్చ కలర్ చీర ధరించడంతో పాటు మెడలో ఎర్రపూసల దండ ఉందని పోలీసులు తెలిపారు. శవం నీటిలో చాలా రోజుల నుంచి ఉండడంతో బాగా ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోడుమూరు పోలీసులు తెలిపారు.